క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కుప్పం: సాయిమాత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బెంగళూరుకు చెందిన శంకర ఆస్పత్రి కంటి వైద్యనిపుణులతో కంటి పరీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్స ఉచితంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఫ్యామిలీ ఫిజిషియన్‌లో మలేరియా అధికారి జయశంకర్

గంగవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి జయశంకర్ పేర్కొన్నారు. మండలంలోని సామరాజుపల్లిలో గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కలగటూరు గ్రామంలో లార్వా సర్వే చేశారు. పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించి వైద్యసిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తహసీల్దార్‌కు సత్కారం


హుస్సేన్‌ను సన్మానిస్తున్న ముస్లిం నేతలు

సదుం: జిల్లా రెవెన్యూ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తహసీల్దార్ హరూఫ్ హుస్సేన్‌ను శనివారం ముస్లిం ఐక్య వేదిక నేతలు ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం


పత్రికా విలేకరులకు శుభాకాంక్షలు చెపుతున్న డా.మమతారాణి

పలమనేరు: పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆపిల్ పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి, వైద్యులు డా.యుగంధర్ పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మకులలో ఏపీయూడబ్ల్యూజే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆదిశేషయ్య, రమేష్, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

రాష్ట్రంలో విలేకరులపై జరుగుతున్న దాడలను అరికట్టాలని పలమనేరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమేరకు స్థానిక విలేఖరుల సమస్యలపై పలమనేరు ఆర్డీఓ భవానీకి ఓ వినతిపత్రాన్ని శనివారం అందజేశారు.

షికారీ కాలనీలో నీటి సమస్య


తమకు నీళ్లు రావడం లేదంటున్న షికారీలు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని షికారీ కాలనీలో నీటి సమస్య నెలకొందని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగు బోర్లు వేసినా నీళ్లు రాలేదన్నారు. ఆపై తమ కౌన్సిలర్ రాజేష్ చొరవతో సొంతంగా బోరు వేయడంతో అర ఇంచ్ నీళ్లు వచ్చాయని తెలిపారు. కానీ ఇప్పుడు పాలిటెక్నిక్ కళాశాలకు తమ బోరు పైప్‌లైన్ నుంచి నీటిని ఇస్తున్నారన్నారు. దీంతో తమ కాలనీలోని 50 ఇళ్లకు నీరు రాకుండాపోయిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని షికారీ కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

పలమనేరు: పట్టణంలోని పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం మామడుగు సమీపంలోని గజారామంలో నిర్వహించనున్నట్లు పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కుటుంబసమేతంగా అందరూ హాజరు కావాలని వారు కోరారు.

ఈసీ పౌల్ట్రీ వైపు రైతన్నల చూపు!

- ఇప్పటిదాకా ఓపెన్ పౌల్ట్రీఫామ్‌లు
- ఇప్పుడు ఆటోమేటిక్ ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్ పౌల్ట్రీఫామ్స్
- నిఖర లాభాలు
- ఏడాదికి ఎనిమిది దఫాలుగా కోళ్ల పెంపకం
- వి.కోటలో విజయవంతంగా ఈసీ పౌల్ట్రీ


ఈసీ ఫామ్‌లో పెరుగుతున్న బ్రాయిలర్ కోళ్లు

పలమనేరు: సంప్రదాయ పద్ధతుల్లో ఏ పనులు చేసినా అనుకున్న లాభాలు లేక నష్టాలబాటలో ఉన్న రైతులు నూతన సాంకేతిక విధానాలవైపు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈసీ(ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్) పౌల్ట్రీషెడ్లు ఓ సంచలనంగా మారింది. ఇందులో రైతుకు పెక్కు లాభాలుండడంతో పలువురు రైతులు కొత్త విధానంపై ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా బ్రాయిలర్ కోడి పిల్లలు(చిక్స్)ను ఓపెన్ ఫామ్స్‌లో రైతులు సంరక్షిస్తుంటారు. వీటి పెరుగుదలకు అవసరమైన ఉష్ణోగ్రత తగ్గినా, లేదా పెరిగినా ఆ ప్రభావం కోళ్లపై పడి రైతుకు ఆశించిన దిగుబడులు రావు. కానీ ఈసీ(ఎన్విరాన్‌మెంట్లీ కంట్రోల్డ్) బ్రాయిలర్ ఫామ్‌లలో చిక్స్ నుంచి కోళ్ల దాకా అవసరమైన ఉష్ణోగ్రతను కల్పించి అధిక దిగుబడులను సాధించడమే ఈ కొత్త విధానం ప్రత్యేకత. దీంతో ఉమ్మడి జిల్లాలో పలువురు పౌల్ట్రీ రైతులు పెట్టుబడి ఎక్కువైనప్పటికీ ఈసీ ఫామ్స్‌వైపు ఆసక్తి చూపుతున్నారు.

ఇదిగో సాక్ష్యం...

పలమనేరు నియోజకవర్గంలోని వి.కోటకు చెందిన ఔత్సాహిక రైతు పీఎస్ నాగరాజు పౌల్ట్రీ రంగంలోనూ నూతన ఒరవడిని చూపుతూ తన వ్యవసాయక్షేత్రంలో తూర్పు, పడమటగా 400 అడుగుల పొడవు, 47 అడుగుల వెడల్పుతో (8,400 చదరపు మీటర్లు) ఈసీ షెడ్డును మూడేళ్ల క్రితం నిర్మించాడు. ఈ షెడ్డుకు 24 గంటలు త్రీఫేజ్ కరెంట్‌ను ఏర్పాటు చేశాడు. బిగ్‌టచ్ మ్యాన్ అనే ఈసీ షెడ్ల నిర్మాణ కంపెనీ ద్వారా తన పొలంలో షెడ్డు నిర్మాణం చేశారు. షెడ్డు లోపల రెండు వైపులా 80 అడుగుల మేర ఉష్ణోగ్రతలను అదుపులోకి తీసుకొచ్చే ఏసీ ప్యానెళ్లను అమర్చారు. కోళ్లకు మేత, నీటి కోసం ఆరు డ్రింక్లర్‌లేన్లు, ఐదు ఫీడర్‌లేన్లను అమర్చారు. ఈసీ షెడ్డుకు అవసరమైన బోరు, మోటారు, ఓవర్‌హెడ్‌ట్యాంకు, ఫీడ్ స్టోరేజీ గదిని ఏర్పాటు చేశారు. దాణా బస్తాలను హ్యాపర్‌లో ఓ మనిషి వేస్తే చాలు కోడిపిల్లలకు అవసరమైన దాణా, నీరు సెన్సర్ల సాయంతో ఆటోమేటిక్‌గా అందుతోంది. కోడిపిల్లలకు 27 డిగ్రీల ఉష్ణోగ్రత అవసరమైతే బయటి ఉష్ణోగ్రత పెరిగినప్పుడు వాటంతటవే ఫ్యాన్లు ఏసీ స్టార్ట్ అవుతుంది. ఒకవేళ వర్షం కురిసి, లేదా చలికారణంగా గాలిలో తేమశాతం తగ్గి ఉష్ణోగ్రత తగ్గితే అదే హీట్‌ను పెంచి కావాల్సిన ఉష్ణోగ్రతకు తీసుకొస్తుంది. వీటన్నంటి నియంత్రణకు ఫామ్‌లోనే ఓ మానిటరింగ్ రూమ్ ఉంటుంది. అందులోని డ్యాష్‌బోర్డుపై కోడి పిల్లల తాగిన నీరు, ఆహారం, ఉష్ణోగ్రత వివరాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. వాటిని చూసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా ఆగినపుడు సెకన్ల వ్యవధిలో ఆటోమేటిక్‌గా జనరేటర్ స్టార్ట్ అవుతుంది. పవర్ రాగానే అది ఆఫ్ అవుతుంది. ఇలాంటి ఎన్నో సాంకేతిక సౌకర్యాలతో ఇంత పెద్ద షెడ్డును ఒకరిద్దరు మాత్రం ఆపరేట్ చేసేలా ఈసీ విధానంతో రైతు షెడ్డును నిర్మించారు. మొత్తం మీద ఈసీ షెడ్డు నిర్మాణం, పరికరాలు అన్నింటికి కలిపి రూ.90 లక్షల నుంచి కోటి దాకా పెట్టుబడిగా పెట్టారు.

ఈసీ షెడ్లతో లాభాలు ఇలా..

- సాధారణ పౌల్ట్రీఫామ్‌లో స్పేస్‌లోనే రెట్టింపు చిక్స్ నిర్వహణ.
- 35 రోజుల్లోనే 2.3కిలోల కోళ్ల ఉత్పత్తి.
- 8 దఫాలు కోళ్లు తీయొచ్చు.
- ఆటోమేటిక్ సిస్టం కావడంతో ఫామ్ పర్యవేక్షణ ఒకరితోనే.
- చిక్స్‌లో ఖర్చు తగ్గి అధిక ఉత్పత్తులు.
- మృతిచెందే కోడిపిల్లల శాతం చాలా తక్కువ.
- నాణ్యమైన కోళ్లు, సమానమైన బరువులుంటాయి.
- ఫీడ్ వృథా ఉండదు.
- కంపెనీలు కోళ్ల సంరక్షణ రేటు ఎక్కువగా ఇస్తాయి.

వి.కోట వద్ద ఈసీ పౌల్ట్రీఫామ్


ఈసీ పౌల్ట్రీ లాభదాయకమే..



నా పొలంలో రూ.కోటి వెచ్చించి ఈసీ పౌల్ట్రీఫామ్ ఏర్పాటు చేశా. ఇందులో 26 వేల చిక్స్‌ను పెంచుతున్నా. 32 రోజులకు కోళ్లు తీస్తున్నా. కోళ్ల బరువు కూడా 2.3కిలోలుగా వస్తోంది. కంపెనీవాళ్లు ధర ఎక్కువగానే ఇస్తున్నారు. ఈసీలో ఓ కూలీ ఉంటే చాలు. ఏటా ఎనిమిది దఫాలు చేసుకోవచ్చు.

–పీఎస్ నాగరాజు, ఔత్సాహిక రైతు, వి.కోట

అయ్యప్ప దర్శన వేళల్లో మార్పులు



దర్శన సమాచార బోర్డు

సదుం: కార్తీక మాసం ప్రారంభం కావడంతో అయ్యప్ప భక్తులతో ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయం సందడిగా మారింది. నవంబరు 15 నుంచి ఆలయ దర్శన వేళల్లో మార్పు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 3 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 4 నుంచి 9 గంటల వరకు అభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆక్రమిత స్థలాలకు కొలతలు


షాపు కొలతలు తీస్తున్న ఈఓ కమలాకర్

చౌడేపల్లె: స్థానిక ప్రైవేట్ బస్టాండ్ సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూములను ఆక్రమించి నిర్మించుకున్న షాపులు, ఇళ్ల స్థలాలను అధికారులు శనివారం కొలతలు తీశారు. ఆలయ ఈఓ కమలాకర్ ఆధ్వర్యంలో 178/1,2,179/1,3,108/2 సర్వే నంబర్లలోని 2.14 ఎకరాల్లో నిర్మించిన 59 దుకాణాలు, 56 గృహాలకు కొలతలు తీశారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఈఓ వెల్లడించారు.

పోస్టల్ ఖాతాతో ఉపయోగం


పోస్టల్ ఖాతా ఓపెన్ చేయిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: ఐపీబీపీ పోస్టల్ ఖాతా 18ఏళ్లు నిండిన వారికి ఎంతో ఉపయోగకరమని, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందవచ్చని పోస్టల్ ఏఎస్పీ జి.గణపతి తెలిపారు. శనివారం ఈమేరకు చౌడేపల్లెలో పోస్టల్ అకౌంట్ మేళా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పోస్టల్ ఖాతాపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో నగదును సులువుగా విత్ డ్రా చేసుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం మురళి, సిబ్బంది హయ్యాఖాన్, ప్రేమ్ కుమార్, నందగోపాల్, తరుణ్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: సబ్‌కి యోజన, సబ్ కా వికాస్ పథకం కింద గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాధవిలత ఆధ్వర్యంలో సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా మంచినీటి సమస్య, పారిశుధ్య కార్యక్రమాలు, రహదారులు, మురుగునీటి కాలువలు ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిర్దేశించిన మేరకు ప్రణాళికలను గ్రామసభల ద్వారా సిద్ధం చేయాలని చెప్పారు. ఆయా నివేదికలను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల ద్వారా ప్రభుత్వానికి సమర్పించి, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జ్ఞానప్రసన్న, కో–ఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్, వైఎస్సార్‌సీపీ నేత బాబు పాల్గొన్నారు.

పతనమైన బంతిపూల ధరలు


నాయనపల్లి వద్ద సాగు చేసిన బంతిపూల తోట

శాంతిపురం: బంతి పూల ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం కిలో బంతిపూలు రూ.2 పలుకుతున్నాయి. బంతిపూల సాగుకు ఎకరాకు రూ.60 వేల వరకూ ఖర్చు అయ్యిందని, ఇప్పుడు మార్కెట్ ధరలు పడిపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. గత వారం వి.కోట మార్కెట్‌లో కిలోకు రూ.5 వరకూ ఉండగా శనివారం మరింతగా పతనమయ్యాయి. 50 కిలోల బస్తా రూ.100 పలికిందని, దీంతో రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో బంతి సాగులో ఉంది. నారు నాటిన 50 రోజులకు వచ్చిన పూలకు ధరలేక రైతులు తోటల్లోనే వదిలేస్తున్నారు. కార్తీక మాసంలో పూజలు, శుభకార్యాలతో మంచి ధర ఉంటుందనే అంచనాతో బంతి సాగు చేస్తే ఈ దఫా నిండా మునిగామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెద్దపంజాణి: మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త దత్తారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గంగవరం, పెద్దపంజాణి మండలాలకు చెందిన రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పురుగు మందులు చెట్టు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా పూత సమయంలో నీటి తడులు ఇవ్వకూడదని, పూత పూర్తిగా విచ్చుకున్న తర్వాత క్రిమిసంహారక మందులు చల్లడం నిలిపివేయాలన్నారు. ఉద్యాన అధికారి వరప్రసాద్, వీహెచ్‌ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పలమనేరు: మండలంలోని పంచాయతీల నిధులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎంపీడీఓ ఖాదర్‌బాషా, ఈఓఆర్డీ రాజేంద్ర బాలాజీ పంచాయతీల్లో అవసరమైన పనులను తెలుసుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏ.కొత్తకోటలో ఫ్యామిలీ డాక్టర్


సూచనలిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పవన్‌కుమార్ పలువురికి వైద్య పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కార్యక్రమంలో డీపీఎంఓ దేవ, ఎంపీహెచ్‌ఈఓ హరి, ఎంపీహెచ్‌ఎస్ రెడ్డెమ్మ, ఏఎన్‌ఎం రుక్మిణి పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఎస్‌ఎం పల్లె, సదుంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు శనివారం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా డాక్టర్ చరణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, జానకి, శ్రావణి, మనోహర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా కోల్డ్ స్టోరేజీ భవనం



కుప్పం రూరల్: కుప్పంలో ప్రారంభించిన కోల్డ్ స్టోరేజీ భవన నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రభుత్వం హడావుడిగా కుప్పం మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ భవన నిర్మాణ పనులను ప్రారంభించింది. తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో పనులు ఆగిపోయాయి. పైకప్పు వరకు నిర్మాణం పూర్తి చేసి కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కోల్డ్ స్టోరేజీ భవనం పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

కనకదాస జయంతి రేపు

కుప్పం: ఈ నెల 18న కుప్పంలో కనకదాస జయంతి నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం శుక్రవారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గంలో కురుబ సామాజిక వర్గం అధికంగా ఉండటం, అదే సామాజిక వర్గానికి కనకదాస ఆరాధ్య దైవం కావడంతో ఈ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే అర్ధాంతరంగా ఆగినా కురుబ కులస్తులు భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు.

జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి వినతి


వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

పుంగనూరు: జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ సలీం డిమాండ్ చేశారు. శనివారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు హెల్త్‌కార్డులతో పాటు గౌరవ వేతనం అందించాలని, చిన్న పత్రికలకు జీఎస్టీ మినహాయించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు పంపిణీ చేసి, గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. సీనియర్ జర్నలిస్టులకు గౌరవవేతనం, పెన్షన్లు అందించాలని విన్నవించారు. ప్రతి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ప్రెస్‌క్లబ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గిరి, వాలెప్ప, లోకేష్, మురళి, మణిబాబు, జగన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి


మాట్లాడుతున్న సీఐ మల్లేష్ యాదవ్

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో గంజాయి నిర్మూలనకు అందరూ కృషిచేయాలని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. కుప్పంలో గంజాయి నిర్మూలనకు నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేశారు. ఆయా కమిటీల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి 28 రోజులు గంజాయి నిర్మూలనకు యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి సాగు, విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి వినియోగంపై ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్‌ఐ మోహన్, ఈఓపీఆర్డీ విజయదత్తు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలకు తరలుతున్న కలప


చౌడేపల్లె నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

చౌడేపల్లె: అటవీప్రాంతంలో యథేచ్ఛగా కలపను నరికేసి ఇటుక బట్టీలకు తరలించేస్తున్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో భారీ వృక్షాలను సైతం అక్రమార్కులు నేలమట్టం చేసేస్తున్నారు. విలువైన కలపను ఫర్నీచర్ తయారీకి వినియోగించుకుని, మిగిలిన కట్టెలను ఇటుక బట్టీ యజమానులకు అమ్మేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీలో కలపను తరలిస్తున్నారు. అడ్డుచెప్పిన అధికారులకు మామూళ్లు ముట్టజెపుతూ దందా సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్ల నరికివేతకు అడ్డు కట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు గ్రంథాలయంలో కవిసమ్మేళనం


మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

పలమనేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా నేడు కవిసమ్మేళనం జరుగుతుందని లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని తెలుగు సాహితీ అభిమానులు జయప్రదం చేయాలని అందులో సూచించారు.

ఇప్పుడైనా రాజు మనసు కరిగేనా?


ఆర్టీసి బస్టాండ్ వద్ద రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షపు నీరు

పుంగనూరు: పట్టణ నడిబొడ్డునగల ఆర్టీసీ బస్టాండ్, కోర్టు రోడ్డుకు ప్రధాన రహదారిగా ఉన్న రోడ్డును బాగు చేసేందుకు రాజు మనసు కరిగేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణ బస్టాండు, కోర్టు నిర్మాణాలకు కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను తెలుగుదేశం సీనియర్ నాయకుడు వెంకటరమణరాజు విరాళంగా ఇచ్చారు. కానీ బస్టాండుకు వెళ్లే రోడ్డు స్థలాన్ని ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో ఆరోడ్డును మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేయలేదు. దీని కారణంగా రెండు అడుగుల లోతు గుంతలు ఏర్పడి, బస్సులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువారం పడిన వర్షానికి నీరు నిలిచిపోవడంతో ఆప్రాంతంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు పనులు చేసేందుకు మున్సిపాలిటీలో ప్రతిపాదనలు పెట్టినా రాజు అంగీకరించకపోవడంతో పనులు జరగలేదు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్న వెంకటరమణరాజు ఇప్పుడైనా తన మనసు మార్చుకుని రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు. రాజు మనసు మారుతుందోలేదో వేచి చూడాల్సి ఉంది. దీనిపై మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాను విచారించగా రోడ్డు స్థలాన్ని మున్సిపాలిటికైనా లేదా ఆర్టీసీకైనా కేటాయిస్తే పట్టణ ప్రజల కోసం మున్సిపల్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు.